క్లుప్తంగా

తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల వారోత్సవాల్లో సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు

కంచరపాలెం: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం, రోగనిరోధక శక్తినిచ్చే అమృతం వంటివని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జె.టి.ఎస్.జ్యోతి అన్నారు. 55వ వార్డు జాషువానగర్ కంచరపాలెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తల్లిపాల శ్రేష్ఠతపై గర్భిణులు, బాలింతలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నవజాత శిశువుల సరైన అభివృద్ధికి తల్లిపాల శ్రేష్ఠమైనన్నారు. ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీ పేట పీహెచ్‌సీ వైద్యాధికారి శశిప్రియాంక, గౌతమి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: స్థానిక రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సంఘ గౌరవ అధ్యక్షుడు గొల్లమాల అప్పారావు అన్నదానం చేశారు. సుమారు 500 మందికి అన్నదానం జరిపామని, మహిళలకు చీరలు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, వీటిలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు అప్పారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి వెంకటరావు, భీర భైరవమూర్తి, బొత్స అప్పారావు, టీకి గణేష్, అన్ను సుబ్రమణి, నీళ్ల గణేష్, ధనాల అప్పారావు, కొణతాల ప్రేమానందం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవుడికి విశేష సేవలు



వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష సేవలు నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనారోగ్యం కారణంగా ఒక వ్యక్తి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం లలితాదేవి గుడి ప్రాంతంలో రంగస్వామి కిరణ్‌కుమార్(50) అనే వ్యక్తి ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇతడికి పెళ్లికాలేదు. ఇతను స్థానికంగా ఫోటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా పైల్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. కిరణ్‌కుమార్ ఇంటిపైనే ఇతడి అన్నయ్య రంగస్వామి తస్య వెంకటరాజన్ నివసిస్తున్నాడు. శనివారం ఉదయం వెంకటరాజన్ కిందికి వచ్చి చూడగా.. తన సోదరుడు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించి వెంటనే 112కి కాల్ చేశాడు. పోలీసులు వచ్చి చూడగా ఇంటి తలుపు లోపల నుంచి గడియ పెట్టి ఉండటంతో పగులగొట్టి లోనికి వెళ్లి పరిశీలించగా కిరణ్ కుమార్ ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. మృతుడిని అతడి సోదరుడు చివరిసారిగా గత నెల 30న చూసినట్లు తెలిపాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాకపోకలకు పరేషాన్

- ఆక్రమణలతో కుచించుకుపోతున్న రహదారులు
- తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్‌లో నెలలుగా కదలని వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, పాదచారులు
- దృష్టి సారించని అధికారులు



తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్‌లో నెలలుగా పార్క్‌చేసి వదిలేసిన వాహనాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 45 వార్డుల్లోని విశాలమైన రహదారులు కాస్తా ఇరుగ్గా మారుతున్నాయి. ఇవన్నీ ఆక్రమణలతోనే కుచించుకుపోయాయి. కొన్ని చోట్ల ఇవి వ్యాపారాలకు ఉపయోగపడుతుంటే, మరికొన్ని చోట్ల గొడౌన్స్‌లా వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా తాటిచెట్లపాలెం–మహారాణి పార్లర్ 80 అడుగుల రహదారి నిత్యం ఆక్రమణలతోనే నిండి ఉంటుంది. ఈ మార్గంలోని సగం భాగం ఎప్పుడూ ప్రైవేట్ వాహనాల పార్కింగ్, ఇటుక, ఇసుక, పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రితో నిండి ఉంటుంది. దీంతో ఈ రోడ్డు సగానికి పైగా కుచించుకుపోయింది. దీంతో పాదచారులు రోడ్డు మధ్యలో నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా 80 ఫీట్ రోడ్డులో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో రహదారుల ఆక్రమణ, వాహనాల రాంగ్ పార్కింగ్‌లపై అధికారులు దృష్టి సారించకపోవడంతో స్థానికులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

కార్‌ల నుంచి బస్సుల వరకు..

తాటిచెట్లపాలెం జీవీఎంసీ వాటర్ ట్యాంక్స్ నుంచి రామచంద్రనగర్ ఆర్చ్ వరకు రోడ్డుకిరువైపులా చిన్న చిన్న కార్‌ల నుంచి పెద్ద పెద్ద బస్సుల వరకు పార్క్ చేస్తున్నారు. కొన్ని వాహనాలు ఉదయమే తీసి, సాయంత్రం తిరిగి నిలుపుతుంటారు. కొన్ని వాహనాలు ఎందుకు పనికిరాకుండా కనీసం కదలలేని, కదపలేని స్థితిలో రోడ్డు మీదే పడి ఉన్నాయి. వీటి వల్ల కూడా రోడ్డు ఇరుకైపోయింది.



రహదారిలో పనికిరాని ఆటో చుట్టూ గోవులు, దూడలను కట్టిన వ్యాపారులు

నిత్యం ట్రాఫిక్ కష్టాలు

తాటిచెట్లపాలెం బజార్ రోడ్డులో ఇరువైపులా ఆక్రమించి చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనివల్ల వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రైల్వే న్యూకాలనీలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో అసలే చిన్న రోడ్లు కావడంతో వాటిపైనే పార్కింగ్, వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక్కడ కొన్ని ప్రైవేట్ స్కూళ్లు కూడా ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోంది. సంబంధిత అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తాటిచెట్లపాలెం బజార్ రోడ్డులో దుస్థితి

నడిరోడ్డుపైనే వ్యాపారాలు..

తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డుపైనే పలువురు **వ్యాపారాలు** సాగిస్తున్నారు. భవన నిర్మాణాలకు **అవసరమైన** ఇటుక, ఇసుక, పిక్క వంటి **సామగ్రిని రోడ్డు**పైనే వేసి ఇక్కడి నుంచి చిన్న **చిన్న ఆటోలు,** వ్యాన్‌ల ద్వారా విక్రయిస్తున్నారు. **ఈ రహదారి**పైనే వాహనాల మరమ్మతులు, **ఇతర వ్యాపా**రాలు సాగిస్తున్నారు. వీరు **ఎటువంటి అద్దె,** అడ్వాన్స్‌లు లేకుండా రహ**దారిపై, లేదా** ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు **సాగించుకుంటు**న్నారు. ఇలా 80 అడుగుల **రోడ్డు వివిధ కారణాలతో** కుచించుకుపోయింది. **వీటిని తొలగించి** పూర్తిగా రహదారిని అందుబా**టులోకి తీసుకొ**స్తే చాలా సౌకర్యంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.



జీవీఎంసీ వాటర్ ట్యాంక్స్ ఎదురుగా రోడ్డుపైనే వ్యాపారాలు

ఉర్దూ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం



స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, వైజాగ్ సురభి సభ్యులు

తాటిచెట్లపాలెం: రోటరీ క్లబ్ వైజాగ్ సురభి ఆధ్వర్యంలో శనివారం ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ పాఠశాలలో స్నేహితుల దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ కొత్తగా మొలకెత్తే మొక్కల మాదిరిగానే స్నేహాలు వికసించడం, వృద్ధి చెందడం జరుగుతాయన్నారు. ప్రకృతికి కృతజ్ఞతను తెలియజేసేలా ఫ్రెండ్‌షిప్ డేను జరుపుకోవాలన్నారు. దీనికి నిదర్శనంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, రోటరీ క్లబ్ వైజాగ్ సురభి అధ్యక్షురాలు టి.సత్య శ్రీలక్ష్మీదేవి, సభ్యులు డాక్టర్ బాలాజి సంతోష్, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

50వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ ప్రసాద్

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డులో రూ.1.18 కోట్లతో అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, బీజేపీ నాయకులు శ్యామలదీపిక, సునీల్ అగర్వాల్, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, మార్కెటింగ్ డైరెక్టర్ టి.పద్మజ, బీజేపీ వార్డు అధ్యక్షుడు వెంకటరావు, స్థానిక నాయకులు కె.వి.రమణ, ఎన్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

48వ వార్డు కొండవాలులో..

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి ఇందిరానగర్–3, నీలకంఠనగర్, బాపూజీనగర్ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ గంకల కవిత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు భూమిపూజ చేశారు. డ్రైనేజీలు, మెట్ల మార్గాలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాల్లు, కొండవాలుకు రక్షణ గోడల నిర్మాణానికి సుమారు రూ.3.46 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము, డీఈ దిలీప్‌కుమార్, నాయకులు గంకల అప్పారావు, అనిల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో క్రైస్తవ నాయకుల సదస్సు



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పాల్ విక్టర్, పాస్టర్లు

తాటిచెట్లపాలెం: కైలాసపురం డౌన్‌లోని గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో శనివారం క్రిస్టియన్ లీడర్స్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను కార్యవర్గ సభ్యులతో కలిసి డాక్టర్ గరికిముక్కుల పాల్ విక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో జాతీయ క్రైస్తవ నాయకుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశంలో క్రైస్తవులు, సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, జీవోలు, క్రైస్తవుల హక్కులు, ప్రాధాన్యతల గురించి చర్చిస్తారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి రిటైర్డ్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు డాక్టర్ కె.బాబూరావు, డాక్టర్ ఐ.శామ్యూల్ ఆనంద్, డాక్టర్ విజయ్‌కుమార్, ఎఫ్ఐజీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇమ్మానుయేల్ రాబర్ట్స్, ఏఐసీసీ ప్రెసిడెంట్ రెవరెండ్ జుహాని హాలోనెన్, ఇవాంజలిస్ట్ రెవరెండ్ మృత్యుంజయ, రక్షణ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ బెన్‌హర్ జక్కుల తదితరులు తెలియజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా సంఘాల పాస్టర్లు బాలరాజు, ఎల్.సామ్యేలు, జార్జిబాబు, వరప్రసాద్, బెంజిమన్, పద్మకుమార్, విజయ్ కుమార్, బంగారి సాల్మన్‌రాజు, జాన్ మేరి, మేరి భాస్కర్, బాబ్జీ, సామ్యేల్‌సాంబ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంఘ పెద్దలు, మహిళల సమాజం సభ్యులు కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు.

పర్యావరణ హిత రాఖీలతో మేలు

మర్రిపాలెం: పర్యావరణ హిత రాఖీలనే వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర జాయింట్ ఎన్విరాన్‌మెంటల్ చీఫ్ సైంటిస్ట్ శ్రీరంజని పిలుపునిచ్చారు. మాధవధారలోని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయంలో శనివారం గ్రీన్ క్లైమేట్ టీం నేతృత్వంలో మురళీ మాధవ విద్యాలయం, శ్రీవిద్యావికాస్ స్కూల్ విద్యార్థులతో దేశీయ విత్తనాలతో రాఖీలు చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశీయ విత్తనాలతో చేసిన రాఖీలు ఆరోగ్యకరమని, ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని సూచించారు. ప్రకృతి ఆధారిత ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని, మన ఆరోగ్యం మన జీవన విధానంతో ముడిపడి ఉందని వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ముకుంద మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై నిరంతరం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీనివాస్, వనమాలి సిటిజ సంస్థల అడ్మిన్లు మళ్ల సరిత, అరవల అరుణ, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ అనకాపల్లి ఫెసిలిటేటర్ కృష్ణకుమారి, మినియేచర్స్ ఆర్టిస్ట్ రమాదేవి, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కో ఆర్డినేటర్ జె.రాజేశ్వరి, ఉపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆరు కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు 6 కిలోల గంజాయిని సీజ్ చేసి, అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) వెల్లడించిన వివరాల ప్రకారం... జీఆర్‌పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్.ఐ. అబ్దుల్ మారూఫ్, ఆర్‌పీఎఫ్ ఎస్.ఐ. జూలీ కర్మాకర్లు శనివారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన సిలు దలై బ్రహ్మపూర్ నుంచి చెన్నైకి విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి సుమారు రూ.30వేలు విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసని జీఆర్‌పీ సిబ్బంది, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

నాటక రంగ ధ్రువతార బళ్లారి రాఘవ



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌వో భవానీ శంకర్ తదితరులు

మహారాణిపేట: కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నాటక రంగంలో బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయం అన్నారు. నాటక రంగంలో సంచలనాలు సృష్టించి, సినిమా రంగానికి వెళ్లి గొప్ప నటుడిగా గుర్తింపు పొందారన్నారు. తెలుగు, ఇంగ్లీషు, కన్నడ, హిందీ భాషలన్నింటిలోనూ రాఘవ నటించారని వివరించారు. కళా రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం 1981లో తపాలా బిళ్ల విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఇన్‌చార్జి పరిపాలనాధికారి బీవీ రాణి, సూపరింటెండెంట్ సుజాత, ఉప తహసీల్దార్లు సుధీర్, బి.రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల ప్రిన్సిపాళ్లకు సెల్ఫ్ లీడర్‌షిప్ వర్క్‌షాప్

తాటిచెట్లపాలెం: కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్‌లో జోన్–1 పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల ప్రిన్సిపాళ్లకు సెల్ఫ్ లీడర్‌షిప్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయులు మాట్లాడుతూ గురుకులాల ప్రిన్సిపాళ్లు తమ నాయకత్వ నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలి, విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎలా కాపాడాలి, వారి మానసిక, విద్యాభివృద్ధికి ఎలా దోహదపడాలి అనే విషయాలను తెలియజేశారు. విద్యా సంస్థల్లో సానుకూలమైన మార్పులు తీసుకురావడానికి ప్రిన్సిపాల్ దార్శనికతతో, బాధ్యతతో ముందుండాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులు 80 మందికి లాంగ్‌టర్మ్ నీట్ కోచింగ్ ఇచ్చి, వారిని డాక్టర్లు చేసే దిశగా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. ప్రిన్సిపాళ్లు స్వీయ నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా సంస్థలో ఇతరుల నాయకత్వాన్ని ఎలా పెంపొందించుకోవచ్చనే అంశంపై శిక్షణ అందించిన కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సభ్యులు థామస్, ఫరీజ్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ డీసీవో ఎస్.రామకృష్ణ, విజయనగరం డీసీవో ఎస్.రూపవతి, శ్రీకాకుళం డీసీవో జి.గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కాలేజీలో బహుభాషా జర్నల్ ఆవిష్కరణ



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రతిష్ఠాత్మకమైన బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్ ఆవిష్కరించారు. 'తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల సాహితీ కృషి' అనే అంశంపై ద్వితీయ భాషా విభాగం అధ్యక్షులు, హిందీ ఆచార్యులు డాక్టర్ పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ జర్నల్ రూపొందింది. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ భాషలలో 55 మంది అధ్యాపకులు రచించిన వ్యాసాలతో రూపొందించిన 'బహుళ శోధ్ మంజూష' బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించి మాట్లాడారు. సెమినార్ నిర్వహణతో పాటు సంపాదకత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన డాక్టర్ జయలక్ష్మి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ నిర్మల, డి.కోటేశ్వరరావు, రొజీనా, సుధాప్రియ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌పై శనివారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన, జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి వైద్యులు మహిళలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గైస్ విద్యార్థినులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని పాండురంగాపురానికి చెందిన కావూరి నితీష్ చంద్ర రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో సంబంధిత చెక్కును ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.

కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల మోత



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడానికి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ కంచరపాలెం జోన్–2 ఏపీఈపీడీఎల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో కంచరపాలెం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్, సీపీఎం నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు బాదుడే–బాదుడు అని నినాదాన్ని ఎత్తుకుని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజలు వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారని తెలిపారు. ఇప్పుడు అదే పని చేయడానికి చూస్తున్న చంద్రబాబు, లోకేష్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి 15 నెలల పాలనలో నాలుగు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ఆ భారాన్ని ప్రజలపై మోపిందని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈ జి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సానబోయిన అప్పలరాజు, ఒమ్మి అప్పారావు, సానబోయిన సోమేశ్వరరావు, డి.రామారావు, ఎం.ఈశ్వరరావు, బి.సింహాచలం, పి.మూర్తి, ఎం. కల్యాణి, పి.సత్య తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల డిమాండ్స్ డే'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

తాటిచెట్లపాలెం: వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 4న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ పిలుపునిచ్చింది. అక్కయ్యపాలెంలో శనివారం సమావేశమైన ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, పెన్షన్ చెల్లింపు, అక్రిడిటేషన్ల జారీకి వీలుగా కొత్త జీవో, మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల అవార్డుల ప్రదానం, కేంద్ర, రాష్ట్ర వృద్ధ విలేకరుల కోసం ఓల్డ్ ఏజ్ హోం నిర్మాణం వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాలు అందించాలని సభ్యులు నిర్ణయించారు. జిల్లా పర్యటనల్లో ఉన్న మంత్రులకు తప్పనిసరిగా వినతిపత్రం అందజేయాలన్నారు. అన్ని జిల్లాల శాఖలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

కంచరపాలెం: విద్యార్థి దశ నుంచే సమాజంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కంచరపాలెం పోలీస్ స్టేషన్ ట్రైనీ ఎస్ఐ అజయ్ అన్నారు. రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పిల్లల అక్రమ రవాణా, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై అనే అంశాలపై పాఠశాల హెచ్ఎం పి.చంద్రశేఖర్ నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ చిన్న వయసులోనే సోషల్ మీడియాకు అలవాటు పడడం వల్ల తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఉంటాయన్నారు. యుక్త వయసులో ఏది మంచి, ఏది చెడు అని అర్థం చేసుకునే పరిణతి ఉండదని హానికరమైన కంటెంట్ నుంచి తమను తాము రక్షించుకునే పరిజ్ఞానం కూడా వారికి ఉండదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు మానసిక ఆరోగ్య సమస్యలకు, అనారోగ్యకరమైన శరీర సౌందర్య భావనలకు సులభంగా లోనవుతారని గుర్తు చేశారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవద్దని, అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తెలియజేయాలని నేర్పించాలన్నారు. సోషల్ మీడియాలో ఏం చూస్తున్నారో, ఏం చేస్తున్నారో గమనించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.